## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు



మాచర్ల: పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి వారి సమీపంలో వేంచేసియున్న చారిత్రాత్మక, పురాతన దేవాలయం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాములు వారి దేవాలయ ప్రతిష్ఠ నిర్మాణం కోసం మంజూరైన రూ.20 లక్షల నగదును శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాములు వారి దేవాలయ కమిటీ సభ్యులకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం అందజేశారు. అనేక సార్లు దేవాలయంలో జరిగిన ఉత్సవాలకు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాములు వారి కల్యాణ మహోత్సవానికి విచ్చేసే సమయంలో ఆలయ నిర్వాహకానికి నిధులు మంజూరు చేయించాలని కమిటీ సభ్యులు కోరారన్నారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయించి నగదును అందజేయడం జరుగుతుందని, రాబోయే రోజుల్లోనూ ఎంతో ప్రసిద్ధి చెందిన అమ్మవారి దేవాలయానికి మరో రూ. 15లక్షలు మంజూరు చేస్తానని ప్రభుత్వ విప్ పీఆర్కే చెప్పారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలందిస్తానన్నారు. అంతకుముందు దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులుతో పాటు అర్చకులు, వార్డు కౌన్సిలర్ దస్తగిరి, ఎం శ్రీనివాసరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, న్యాయవాది శ్రీనివాసశర్మ, నక్షత్రపు ప్రసాద్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### నేడు సాయిబాబా మందిర వార్షికోత్సవం



కారెంపూడి: స్థానికి వీర్ల అంకాలమ్మ గుడి సెంటర్‌లోని సాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు స్వామి వారికి జరుగుతాయని ఆలయ అర్చకులు దిలీప్‌కుమార్ తెలిపారు. ఉదయం సుప్రభాతసేవతో మొదలుపెట్టి కాకడహారతి, అభిషేక పూజలు, పల్లకిసేవ, విష్ణు, సాయి చాలీసాల పారాయణం జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ పెద్దలు యేచూరి సురేష్ తదితరులు తెలిపారు.

### నాగేంద్రస్వామికి ధాన్యం, జలాభిషేకం



దాచేపల్లి : స్థానిక శ్రీ నాగేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. విస్తారంగా వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుతూ స్వామివారికి ధాన్యం, జలంతో అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

### ప్రత్యేక అలంకరణలో భవానీ అమ్మవారు



పిడుగురాళ్ల : పట్టణంలోని కనక దుర్గమ్మ దేవాలయంలో భవాని అమ్మవారిని అషాఢ మాసం బోనామహోత్సవం నిర్వహించారు. ఈ బోనాల మహోత్సవం ఈ నెల 19వ తేదీ నుంచి జులై 17వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

### సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్ మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సొంతింటి కల సాకారం..!

- జగనన్న కాలనీల్లో చకచకా గృహ నిర్మాణాలు
- గురజాలలో నాలుగు లే అవట్లలో పనులు
- కొందరు ఇప్పటికే నివాసాల ఏర్పాటు



గురజాలలోని జంగమహేశ్వరపురం జగనన్న కాలనీ లే అవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు

గురజాల : పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం దిశగా కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న ఇళ్ల స్థలాలను సేకరించి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వ నుంచి ఇస్తున్న సబ్సిడీ ని కూడా అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఒక్క సెంటు భూమిని పంపిణీ చేసిన దాఖలాలు కనిపించలేదు. కేవలం గత పాలకులు దోచుకో...దాచుకో అన్న దానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చారే గాని నిరుపేదలను ఆదుకుందాము..వారికి వారి అవసరాలు తీర్చుదామన్న ఆలోచన మాత్రం వారికి రాలేదు. వైఎస్సార్ సీపీ ఎన్నికల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను సాకారం చేస్తామనే హామీలో భాగంగా ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేశారు. అంతేకాకుండా వారు ఇంటిని నిర్మాణం చేసుకుని ఆనందంగా జీవించాలనే ఆశయంతో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే సహకారం అందించి ఇంటి నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. గృహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు కావల్సిన ఇనుము, సిమెంటు, ఇసుకను సకాలంలో అందించడంతో పాటు బిల్లులు సైతం సకాలంలో మంజూరు చేస్తుండడంతో లబ్ధిదారులు సొంతింటి కల సాకారం చేసుకునే పనిలో లబ్ధిదారులు నిమగ్నమైయ్యారు.

**4 లే అవట్లలో 1496 మందికి పట్టాలు పంపిణీ..**

గురజాల పట్టణంలో 4 లే అవుట్లు ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులు 1496 మందికి జగనన్న ప్లాట్లును అందించడం జరిగింది. వీటిలో 1370 మంది ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. వాటిల్లో 531 బేస్ మట్టం లెవల్‌రాగా, 615 బేస్‌మట్టం పూర్తికాగా, 87 స్లాబు లెవల్, 46 శ్లాబు పూర్తి ,91 గృహాలు పూర్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి వారం హౌసింగ్ శాఖ అధికారులు మరియు స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధులు లే అవుట్లను పరిశీలించి లే అవుట్లలో జరుగుతున్న పనులను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో పాటు ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపడుతున్నారు.

**కాలనీల్లో మౌలిక వసతుల కల్పన...**

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి ఇంటి నిర్మాణాలకు కావల్సిన వస్తువులు అన్నీ అందుబాటులో ఉండే విధంగా ఆయా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా అయ్యే విధంగా రహదారులు ఏర్పాటు చేయడంతో పాటు, నీటి వసతి అందుబాటులో వుండే విధంగా , కాలువలు, జగనన్న కాలనీలు ఒక ఊరిని తలపించేలా కనిపిస్తున్నాయి.

### జగనన్న మేలు మరువలేము..



మాకు జగనన్న కాలనీల్లో ఇంటి నివేశన స్థలం మంజూరు చేశారు. మేము గతంలో సొంతయిల్లులేక ఎన్నో ఇబ్బందులుపడ్డాం. జగనన్న లే అవుట్‌లో మాకు స్థలం మంజూరు కావడంతో వెంటనే మా స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకుని గృహప్రవేశం చేసి ఇక్కడే నివసిస్తున్నాం. ఎంతో ఆనందంగా ఉంది. జగనన్న చేసిన మేలును మేము మా కుటుంబ సభ్యులము ఎప్పటికీ మరువలేము. పేదల పాలిట పెన్నిధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

– చౌటూరి దుర్గా, జంగమహేశ్వరపురం

### అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి..



అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ జగనన్న కాలనీల్లో ఇంటి నివేశన స్థలం మంజూరు చేయడం జరిగింది. గతంలో ఎన్నడూ జరగని విదంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నో వేల మందికి పట్టాలు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లో ఒక విజన్ ఉన్న నాయకుడిగా ముందుకు సాగుతున్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఆధ్వర్యంలో అర్హత కలిగిన వారు ఎవరూ నష్టపోకూడదనే ఆలోచనతో పట్టాలు పంపిణీ చేశారు.

– షేక్ బడేజానీ, వైస్ చైర్ పర్సన్ , గురజాల నగర పంచాయతీ

## సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి**



పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: గూడులేని ప్రతి పేదవానికి నివేశన స్థలం ఇచ్చి ఇల్లు కట్టించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) అన్నారు. కారెంపూడి గ్రామ శివారు తండాలో ఇల్లు లేని 40 మంది నిరు పేదలకు నివేశన స్థలాల పట్టాలు ప్రభుత్వ విప్ పీఆర్కే ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏ ఒక్కరికి నివేశన స్థలం ఇవ్వలేకపోయిందని పేదలు అర్జీలిచ్చినా ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేసిందన్నారు. గూడు లేక పేదలు పడుతున్న ఇబ్బందులు గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దీంతో పేదలు ఎంతో కాలంగా నివేశన స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని, ప్రస్తుతం పేదల మనసెరిగిన జగనన్న ప్రభుత్వం పేదవాడి కష్టాలు తెలుసుకుని ఇల్లులేని ప్రతి పేదవాడికి నివేశన స్థలం ఇచ్చి లక్షలాది ఇల్లు కట్టించే బృహత్తర కార్యక్రమం చేపట్టిందని ప్రభుత్వ విప్ పీఆర్కే పేర్కొన్నారు. ఒక్క కారెంపూడిలోనే దాదాపు వెయ్యికి పైగా నివేశన స్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. పట్టాలిచ్చిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో అన్ని ప్రాథమిక సౌకర్యాలు కల్పించి ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు చెప్పారు. చిరకాలంగా ఉన్న పేదల సొంతింటి కలలను జగనన్న ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. అంతకు ముందు కారెంపూడి శివారులో వైఎస్సార్ జగనన్న కాలనీలో నాలుగు బోరు బావుల తవ్వకాలను ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రారంభించారు. బోర్లు వేసిన అనంతరం గృహనిర్మాణాలు ప్రారంభించాలని అధికారులను ప్రభుత్వ విప్ పీఆర్కే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి శ్రీనివాసయాదవ్, సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు ఓ భరోసా.. రుణ అర్హత కార్డు

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రుణ అర్హత (సి.సి.ఆర్.సి) కార్డు...కౌలురైతులకు ఓ భరోసా కల్పిస్తోందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. కౌలు రైతులకు (సి.సి.ఆర్.సి)పై ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రుణ అర్హత (సి.సి.ఆర్.సి) కార్డు ద్వారా ఈ– పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు ఇన్సురెన్స్, పంటను అమ్ముకొనుటకు, రుణాలు పొందుటకు, వివిధ ప్రభుత్వ పథకాలు పొందుటకు కౌలు రైతులకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతికూల వాతావరణం వల్ల వేసిన పంటలు నష్టపోయిన సమయంలో కౌలురైతులకు ఈ రుణ అర్హత కార్డుల వల్ల ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందుతుందన్నారు. సి.సి.ఆర్.సి కార్డులపై భూమి యజమానులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించి వెంటనే కార్డులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ వాలంటీర్, గ్రామ రెవిన్యూ అధికారిని సంప్రదించి పొలం సాగుదారు కౌలురైతు సి.సి.ఆర్.సి కార్డు పొందవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని కౌలురైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రొంపిచర్ల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి నెల్లూరు బయలుదేరిన కారు రొంపిచర్ల సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కొండమ్మ, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. అక్కడ స్థానికులు ప్రమాదాన్ని గమనించి 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## థైరాయిడ్ సమస్యలపై అప్రమత్తత అవసరం

చిలకలూరిపేట: థైరాయిడ్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కేజే ఆసుపత్రిలో థైరాయిడ్ పరీక్షల ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకుంటే ఏర్పడే సమస్యల గురించి వివరించారు. మహిళలకే థైరాయిడ్ సమస్య అధికంగా వస్తుందని పేర్కొన్నారు. రుతుక్రమాలు సరిగా ఉండవని, సంతానోత్పత్తి తగ్గుతుందని వివరించారు. మరో అతిథి డాక్టర్ కొల్లా రామారావు థైరాయిడ్ సమస్యల గురించి అవగాహన కల్పించారు. శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఒయాసిస్ సంస్థ కార్యదర్శి కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామసమీపాన నూతనంగా 33/11 కేవీ సామర్థ్యం కలిగిన విద్యుత్ సబ్ స్టేషన్ పనులు ప్రారంభించినట్లు ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఎకరం స్థలంలో సబ్‌స్టేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. నూతన విద్యుత్ సబ్ స్టేషను నిర్మాణ పనులు పూర్తి అయితే వేల్పూరు, వెలమవారిపాలెం, గంటావారిపాలెం, బొగ్గరం తదితర గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు మరింత విద్యుత్ సేవలు అందుబాటలోకి వస్తాయన్నారు. రూ.4 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. నూతన విద్యుత్ సబ్ స్టేషను ఏర్పాటుతో శావల్యాపురంలో విద్యుత్ సబ్ స్టేషనులో ఆదనపు లోడు భారం తగ్గుతుందన్నారు. మూడు నెలల వ్యవధిలో పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గంటావారిపాలెం నుంచి వేల్పూరు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలు వేయటానికి ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు అయ్యాయని, పంచాయతీ అధికారులు రూ.7 లక్షల 50 వేలు చెల్లిస్తే తక్షణమే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయనతో పాటు ఏఈ సంపంగుల గాంధీబాబు ఉన్నారు.

## పంట వ్యర్థాలకు నిప్పు

**బోరు, సోలార్ ప్లేట్లు దగ్ధం**



యడ్లపాడు: యడ్లపాడు -కారుచోల మధ్య ఉన్న విశ్వనాథ కండ్రిక పరిధిలోని నిమ్మతోట పక్కనే ఉన్న వ్యర్థాలకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నిప్పు పెట్టడంతో తమ పొలంలోని వస్తువులు కాలి నష్టపోయామంటూ బాధిత రైతు పోలీసుల్ని ఆశ్రయించాడు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు గ్రామానికి చెందిన పోపూరి వెంకటరత్తయ్య విశ్వనాథ కండ్రిక వద్ద పొలంలో జామతోటను సాగు చేశాడు. మొక్కలకు నీటి తడులకోసం పొలం వద్ద బోరు, సోలార్‌ప్లేట్లు ఏర్పాటు చేసుకున్నాడు. జామతోటకు కొద్దిదూరంలో పంట వ్యర్థాలకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నిప్పు పెట్టారు. గాలి అధికంగా ఉండటంతో జామతోట వద్ద ఉన్న వ్యవసాయ బోరు, సోలార్‌ప్లేట్లు, పక్కనే ఉన్న పోపూరి నాగేశ్వరరావు జామాయిల్ తోటలోని చెట్లు కొన్ని కాలిపోయాయి. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న బోరు, సోలార్‌ప్లేట్లు దెబ్బతిన్నాయన్నాయి. దీంతో యడ్లపాడు ఎస్‌ఐ పైడి రాంబాబుకు ప్రమాదంపై సమాచారం అందించారు.

## పోలేరమ్మ ఆలయంలో పూజలు



రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసియున్న పోలేరమ్మ ఆలయంలో ఆదివారం పూజలు జరిగాయి. ఆదివారం అమావాస్య సందర్భంగా మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో జీవించేలా చేయమని అమ్మవారిని వేడుకున్నారు. కొందరు మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## సెల్‌ఫోన్ అందజేత

శావల్యాపురం: శావల్యాపురం పోలీసు స్టేషనులో చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను ఫిర్యాదుదారుడికి పోలీసులు అందజేశారు. ఎస్ఐ గల్లా రవికృష్ణ వివరాల మేరకు శావల్యాపురం గ్రామానికి చెందిన పాలడుగు వెంకట నరసింహారావు సెల్‌ఫోన్ ఇటీవల మండలంలో జరిగిన తిరునాళ్లలో తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయగా, సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోను గుర్తించి స్థానిక పోలీసు స్టేషనులో ఆదివారం అందజేశామని ఎస్ఐ గల్లా రవికృష్ణ తెలిపారు.

## శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

చిలకలూరిపేటటౌన్: మూఢ విశ్వాసాల నుంచి ప్రజలను జాగృతం చేస్తున్న జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు చెప్పారు. ఆదివారం పట్టణంలోని సంస్థ కార్యాలయంలో సభ్యత్వ నమోదు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శాస్త్రీయ అభివృద్ధి కోసం, వారికి సైన్సుపై ఆసక్తి కలిగించటం కోసం జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి సంస్థలో సభ్యులుగా చేరాలని కోరారు. సంస్థ జిల్లా కోశాధికారి ఏవీ శివయ్య, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షుడు చుక్కా విన్సెంట్‌పాల్, నాయకులు ఎ.గురులింగం, కంచర్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: టీడీపీకి చెందిన రెండు కుటుంబాలు కారెంపూడి శివారు ఆదినారాయణ కాలనీలో శనివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రజక సంఘ నాయకుడు అలుగునూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు షేక్ సైదా వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్ పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఏ కుటుంబానికి ఏ ఇబ్బంది వచ్చినా అండగా నిలబడే మంచి మనస్సున్న ప్రభుత్వ విప్ పీఆర్కే నాయకత్వంలో పని చేయాలనే ఉత్సాహంతో పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ షేక్ షఫీ, పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, రజక సంఘం నాయకుడు బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

దాచేపల్లి : నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, కాకాని శంకర్ కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. గురజాల, మాచర్ల నియోజకవర్గాల నుంచి 1670 మందికి పైగా రోగులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. కంటి పరీక్షలు చేసిన వైద్యులు 720 మందికి కంటి శుక్లముల ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. పల్నాడు ప్రాంతంలో మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను నాయకులు అభినందించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు చైర్మన్ సుబ్బమ్మ సాంబయ్య మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ అంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు మందపాటి వీరారెడ్డి, నాగుబండి గురువులు, వందనపు వెంకట్రామయ్య, సర్పంచ్‌లు వినుకొండ కోటేశ్వరరావు, కూసం నాగిరెడ్డి, సుంకర విజయరామారావు, నాయకులు గద్దల వేదమణి, ముశ్యం వెంకటేశ్వర్లు, నెల్లూరి రామస్వామి, కొరిమెళ్ల సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి రూ. లక్ష అందజేత



చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: మండల పరిధిలోని నెహ్రూనగర్ తండాకు చెందిన జటావత్ బాలునాయక్‌కు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ. లక్ష చెక్కును ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అందజేశారు. ఇటీవల క్రోసూరు సీఎం జగన్ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా బాలునాయక్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని కలెక్టర్ శివశంకర్ సీఎం దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే స్పందించిన సీఎం జగన్ రూ. లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. సమాచారాన్ని ప్రభుత్వ విప్ పీఆర్కే దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన బాధితుడికి చెక్కు అందజేస్తూ భవిష్యత్‌లో పెన్షన్ మంజూరుకు కృషి చేస్తానని వివరించారు. ఈ సందర్భంగా సహాయాన్ని పొందిన బాలునాయక్ ప్రభుత్వానికి, ప్రభుత్వ విప్ పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సాయిశంకర్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు పుట్టా మారుతి పలువురు పాల్గొన్నారు.

## ఇది పేదల మనసెరిగిన ప్రభుత్వం

**ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి**



చేకూర్చిన సంక్షేమాన్ని మహిళకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ఇది అన్ని వర్గాల ప్రజల మనసెరిగిన ప్రభుత్వమని వారి వారి సమస్యలను గుర్తించి వారికి చేయూతను అందించి ఆదుకునే ప్రభుత్వమని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) ప్రజలకు వివరించారు. కారెంపూడిలో 11వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఆర్కే ఆదివారం రాత్రి నిర్వహించారు. ముందుగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుడి ప్రధాన రహదారితో పాటు అంకాలమ్మ గుడి సెంటర్ వెనుక బజార్లలో గడప గడపకు వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని లబ్ధిదారులకు గుర్తు చేసి మరింత సేవ చేసేందుకు ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. గడప గడపలో ఎమ్మెల్యే పీఆర్కేకు సాదరస్వాగతం లభించింది. ప్రజలకు ప్రభుత్వాలు అందించాల్సిన సేవలను ఎంతో కాలంగా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని వైఎస్సార్ సీపీ జగనన్న ప్రభుత్వం వచ్చాక పౌర సేవలను ప్రజల చెంతకు చేర్చిందని గడప వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరించే నిజమైన ప్రజా ప్రభుత్వానికి నాంది పలికిందని వివరించారు. ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు, రేషన్ అందించడంతో పాటు ఇతర అన్ని రకాల ప్రజల అవసరాలను సమస్యలను వలంటీర్ల ద్వారా గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న తీరును వివరించారు. ప్రభుత్వం అన్ని వర్గాల అన్ని వయసుల ప్రజల అవసరాలు గమనించి అర్హులైన ప్రతి ఒక్కరికీ వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం ఆదుకుంటున్నతీరుపై ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలు బాగున్నాయని ముఖ్యంగా ఎమ్మెల్యేగా మీరు ప్రతి కుటుంబాన్ని గుర్తించి వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటున్న తీరు బాగుందని సంతోషం వ్యక్తం చేవారు. ప్రభుత్వం చేసిన మేలును గుర్తించి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే పీఆర్కే ఈ సందర్భంగా కోరారు. గడప గడపలో ఎమ్మెల్యే పీఆర్కేకు ప్రజలు సాదరస్వాగతం పలకడం శాలువాలు, పూలమాలలతో సన్మానించి ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలు కృతజ్ఞతలు వ్యక్తం చేయడం కన్పించింది. ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి శ్రీనివాసయాదవ్, సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు వివిధ శాఖల అధికారులు గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, మండల పార్టీ కార్యదర్శి పాతూరి రామిరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, కరాలపాటి సుబ్బారావు, ఉప సర్పంచ్ సూరె అంకారావు, పలిశెట్టి కోటేశ్వరరావు, గుండా శ్రీనివాసరావు, చీతిరాల కోటేశ్వరరావు, మిత్తింటి సాంబశివరావు, కొలిశెట్టి మల్లిఖార్జునరావు, కలవల శ్రీనివాసరావు, సూరె సుబ్రమణ్యం, కొత్తా బ్రహ్మేశ్వరరావు, గుండా హరి, కిల్లా కాశి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, యర్రంరెడ్డి వీరారెడ్డి, కిల్లా కాశి ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నేడు మోర్జంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

మాచవరం: మండలంలోని మోర్జంపాడులో నేడు (సోమవారం) గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, ఎంపీడీఓ ఎం.వీ. ప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్ రెడ్డి హాజరై, ప్రభుత్వం అందించిన ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్తులకు వివరిస్తారని తెలిపారు. కావున మండలస్థాయి ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com